విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి నెం. 5
గురువారం 10, జూలై 2025

శాసనసభ్యులు గంటాను కలిసిన ఆనందపురం తహశీల్దార్

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం తహశీల్దార్ గా నియమితులైన సూరిశెట్టి శ్రీనుబాబు బుధవారం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును ఎం.వి.పి. కాలనీలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనందపురం తహశీల్దార్ గా తోట శ్రీవల్లికి జిల్లా కలెక్టర్ గతంలో పోస్టింగ్ ఇచ్చిన విషయం విదితమే. అవినీతి ఆరోపణలున్న ఆమెను కనీసం మాట మాత్రంగానైనా చెప్పకుండా కీలకమైన ఆనందపురం తహశీల్దార్ గా నియమించడం పట్ల గంటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో జిల్లా కలెక్టర్ ఆమె పోస్టింగ్ రద్దు చేసి, భీమిలి డెప్యూటీ తహశీల్దార్ గా పని చేస్తున్న శ్రీనుబాబును పదోన్నతిపై ఆనందపురం తహసిల్దార్ గా నియమించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనుబాబును అభినందిస్తూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆనందపురం పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెవిన్యూ విషయాల్లో ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజన సందోహం

- జెండా ఊపి రథాన్ని ప్రారంభించిన అనువంశక ధర్మకర్త అశోక్ గజపతిరాజు
- భారీ భద్రతతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం /సింహాచలం : ప్రతి ఏడాది ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గిరి ప్రదక్షిణ రథాన్ని ప్రారంభించిన అనంతరం భక్తులు సింహాచలం ఆలయం కింద ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరి కాయలు కొట్టి వారి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. సింహాచలం తొలి పావంచల దగ్గర గిరి ప్రదక్షిణ రథాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులతో కలిసి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. స్వామివారి రథం కొండ చుట్టూ 32 కిలో మీటర్ల దూరం ప్రయాణించి మళ్లీ తొలి పావంచల వద్దకు చేరుకుంటుంది. మార్గ మధ్యలో భక్తుల పూజలు అందుకుంటూ రథం ముందుకు సాగుతుంది. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ వల్ల భూ ప్రదక్షిణ చేసిన పుణ్యం దక్కుతుందని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్ తదితర అన్నిశాఖల సమన్వయంతో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా గిరి ప్రదక్షిణ విజయవంతం చేస్తామని చెప్పారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేంద్ర త్రినాథరావు, కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్న ఈ గిరి ప్రదక్షణ అనేక రాష్ట్రాల నుండి జిల్లాల నుండి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి రాత్రంతా గిరిప్రదక్షిణ చేశారు. 3వేల మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ ఆరు కి.మీ.లకు ఒక బృందం చొప్పున మొత్తం ఆరు అధికార బృందాలను మూడు షిఫ్టులలో కలెక్టర్ నియ మించారు. డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో ఒక్కో బృందంలో ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీసు, వైద్య, విద్యుత్, రెవెన్యూ, జీవీఎంసీ, ఆర్&బి, రవాణా శాఖల అధికారులు, సిబ్బంది ఉంటారు. భక్తులకు ఎలాంటి అవసరమొచ్చినా ఈ బృందాలు తక్షణ సాయం అందిస్తాయి. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం 1800-4250-0009, 0891-2507225 టోల్ ఫ్రీ నెంబర్లను యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. సింహాచలంలో చందనోత్సవములో జరిగిన సంఘటనలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఏ విధమైన లోపం తలెత్తకుండా మూడు సార్లు సమీక్షలు నిర్వహించింది. 5-6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 132 తాగునీటి పాయింట్లు, 500 మరుగు దొడ్లు, ఆరు కంట్రోల్ రూమ్లు, 5 చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టం, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 18 నెట్ వర్కింగ్ ఆసుపత్రులకు వాటిని అనుసంధానం చేశారు. 18 అంబులెన్సులతో పాటు, యాంటీ వేనమ్ వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. 109 ప్రదేశాల్లో 400 తాత్కాలిక మరుగుదొడ్లు, 120 శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ప్రతి టాయిలెట్ వద్ద పారిశుద్ధ్య కార్మికుడు, సూపర్ వైజర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 32 రద్దీ ప్రదేశాల్లో 200 వాట్స్ సామర్థ్యం కలిగిన 750 ఎల్.ఈ.డి. దీపాలు అమర్చారు. ప్రతికూల ప్రాంతాల్లో సీసీటీవీలు పెట్టి.. వాటిని తొలపావంచా వద్ద ఏర్పాటు చేసే ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేస్తారు. అప్పుఘర్ వద్ద 5 బోట్లను, 60 మంది గజ ఈతగాళ్లను, హైమాస్ లైట్లను పెట్టారు. దుస్తులు మార్చుకునేందుకు వీలుగా వసతి కల్పిస్తున్నారు. ప్రమాద నివారలో భాగంగా జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానాలకు అనుమతించటం లేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టారు. 9 జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. ముందు జాగ్రత్త చర్యగా 09, 10వ తేదీల్లో మద్యం షాపులను మూసివేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం 50 ఉచిత బస్సు సర్వీసులను నడుపుతున్నారు. అదనంగా మరొక 20 బస్సులు రిజర్వ్ ఉంచుతున్నారు. స్వామివారి కొండపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రిక పరికరాలతోపాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తొలిపావంచా నుంచి మొదలయ్యే ప్రదక్షిణ పాత అడివివరం మీదుగా పైనాపిల్ కాలనీ, [illegible], హనుమంతవాక, విశాలాక్షి నగర్, జోడుగుళ్ల పాలెం, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, హెచ్బీ కాలనీ, సీతమ్మధార, అల్లూరి విగ్రహం, బాలయ్య శాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, కంచరపాలెం, మాధవధార, మురళీ నగర్, ఎన్ఏడీ కూడలి, గోపాలపట్నం బంకు, ప్రహ్లాదపురం, పాత గోశాల కూడలి మీదుగా తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకోవడంతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పూర్తవుతుంది. ఆ రెండు రోజులూ ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పణ చేస్తారు. 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పిస్తారు. వేకువ జామున 3 గంటల నుంచి ఆలయ వెలుపల నుంచి భక్తులను ప్రదక్షిణకు అనుమతిస్తారు. ఉత్తర గోపురం, దక్షిణ గోపురం వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. గురువారం వేకువజాము ఉదయం 5.00గం. నుంచి దర్శనాలు కొనసాగుతాయి. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులంతా సింహాచలం అప్పన్న స్వామి దర్శనం కోసం క్యూ కడతారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వారందరికీ వివిధ సంస్థలు, సేవ సంఘాలు వివిధ రూపాల్లో భక్తులకు సాయమందించాయి.

జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ భక్తులకు వేడి బాదం పాలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మానవసేవే మాధవసేవ లక్ష్యంతో జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, సింహాచలం శ్రీ వరహాలక్ష్మి నరసింహస్వామి వారి గిరిప్రదక్షిణ కార్యక్రమం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం నుండి జరిగిన నేపథ్యంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ అసోసియేషన్, కాంట్రాక్టర్లు తరపున, సేవాభావంతో ఉచితంగా సేవా కార్యక్రమం చేయుటకు సంకల్పించామన్నారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహము దగ్గర వేడి బాదంపాలు, బిస్కెట్స్ భక్తులకు పంపిణీ చేశారు. ఈ యొక్క కార్యక్రమాలను దిగ్విజయం చేసిన కాంట్రాక్టర్లు సోదరులకు గిరి ప్రదర్శిన చేసిన భక్తులకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్లైన్ బుకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-విశాఖ : వీఎంఆర్డీఏకి చెందిన అన్ని కళ్యాణ మండపాల బుకింగ్ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ఆన్ లైన్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ తెలిపారు. బుధవారం ఉదయం వీఎంఆర్డీఏ బాలల థియేటర్ లో ఆన్ లైన్ బుకింగ్ విధానాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఫంక్షన్ హాళ్ల వివరాలు ఆన్ లైన్ లో ఉంచుతున్నామని తెలిపారు. ఎంఎ, ప్రజలకు అవసరమైన తేదీల్లో ఆన్లైన్ లో చూసుకొని బుక్ చేసుకునే సదుపాయం కల్పించమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్డిఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె జయప్రదం

- డిఆర్ఎం కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన
- లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక హక్కులు, కనీస వేతనాలు, ఇతర సామాజిక చట్టాలు తేవాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విశాఖపట్నంలో సమ్మె జయప్రదం అయింది. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో, మున్సిపల్, ఆశా, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్, చిన్న పరిశ్రమలు, ముఠా, బిల్డింగ్, తోపుడుబండ్లు, ఆటో, మోటారు, గిగ్ వర్కర్స్ వంటి అసంఘటితరంగ కార్మికులు వేలాదిమంది సమ్మెలో పాల్గొన్నారు. రైల్వే డిఆర్ఎం ఆఫీసు నుండి జివియంసి గాంధీవిగ్రహం వరకు మహా ప్రదర్శన అనంతరం బహిరంగసభ జరిగింది. ఈ బహిరంగ సభలో ఏఐటీయూసీ ఆలిండియా ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, సిఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందని అన్నారు. సంఘం పెట్టడం, సమ్మెలు చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతున్నారని చెప్పారు. రోజుకు 8 గంటలకు బదులు 12 గంటలు పని చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం సమ్మె చేస్తే ఒక రోజు సమ్మెకు 8రోజుల జీతం కట్‌అవుతుందని చెప్పారు. కార్మిక నాయకులను జైల్లో పెట్టవచ్చని, పోరాటాలే చేయకుండా అణిచివేసి యాజమాన్యాలకు అత్యధిక లాభాలు తెచ్చి పెట్టడానికి లేబర్ కోడ్లు తెచ్చారని తెలిపారు. లేబర్ కోడ్ల వల్ల తనిఖీలు ఎత్తివేశారని, గతంలో ఒక కార్మికుడు గానీ, యూనియన్ గానీ ఫిర్యాదు చేస్తే వెంటనే ఫ్యాక్టరీ అధికారులు తనిఖీలు చేసేవారని తెలిపారు. యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని చెప్పారు. ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ, బోనస్, కనీస వేతనాలు అమలు గురించి కూడా తనిఖీలు లేకపోవడంతో ఏ ఒక్క చట్టం అమలు కావడం లేదని చెప్పారు. గతంలో ఉన్న తనిఖీల పద్ధతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా 8 గంటల పని దినాన్ని రద్దు చేసి 10 గంటల పని పెట్టాలని, రాత్రి షిఫ్ట్‌లో మహిళలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు చెబుతున్నారని అన్నారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాలను మానుకోకపోతే రానున్న కాలంలో మరింత ఐక్యంగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి నిరసనలు తెలియజేస్తామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఏఐటీయూసీ నాయకులు ఎం.మన్మథ రావు, కసిరెడ్డి సత్యనారాయణ, పడాల రమణ, బి వెంకటరావు, ఎన్. నాగభూషణం, సిహెచ్ కాసుబాబు, అచ్యుతరావు, సిఐటియు నాయకులు ఆర్కేఎస్వీ కుమార్, జగన్, మణి, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, నాగభూషణం, సీఐఎఫ్ టియు జాతీయ నాయకులు కనకారావు, ఏఐసిసిటియు నాయకులు వాసుదేవరావు ఏపీ ఎఫ్ టి దేవా తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం వేతనాల కోడ్‌లో కనీసవేతనం రోజుకు రూ. 178/-లుగా నిర్ణయించింది. దేశంలో ఎక్కడ్కైనా ఇంత తక్కువ వేతనంతో బ్రతకడం సాధ్యమా? విశాఖ స్టీల్‌ను ప్రైవేట్‌కు అప్పగించి కార్మికవర్గాన్ని బాగా తగ్గించి రోబోట్స్ మరియు ఆటో మిషన్ పద్ధతిలో విశాఖ స్టీల్‌ను నడపాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి, అసంఘటిత రంగ అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం రూ. 26,000/-లు ఇవ్వాలని, ఆశా, అంగన్‌వాడీ, మిడ్డేమీల్ ఇతర స్కీం వర్కర్స్‌కు కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు చేయాలి, అసంఘటిత రంగమైన ముఠా, తోపుడుబండ్లు, ఆటో, మోటారు, ఇంటిపనివారు, గిగ్ వర్కర్స్ ఇతర కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేసారు. చిన్నపరిశ్రమలో పనిచేస్తున్న వివిధ రంగాల కార్మికులకు గత 17సం?రాల నుండి పెంచనవలసిన వేతనాల జీవోలు మార్చాలి. ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఆప్కాస్‌ను కొనసాగించాలి. ఈకార్యక్రమానికి సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎఐటియుసి అధ్యక్షులు ఎం.మన్మదరావు, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం అధ్యక్షత వహించారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగ రావు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎస్.కనకారావు, ఐఎఫ్‌టియు నాయకురాలు ఎం.లక్ష్మీ, ఎఐసిటియు నాయకులు దేవా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు సునీల్‌కుమార్ వీరంతా మాట్లాడారు. జిల్లా, యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లోటు బడ్జెట్ ఉన్నా... ప్రతి హామీ నెరవేరుస్తాం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పద్మనాభం : రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పద్మనాభం మండలం అయినాడ, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని ఏడాదిలో చేసిన సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద 42 లక్షల మందికి లబ్ది చేకూర్చగా, కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకాన్ని అందించిందన్నారు. ఒకటో తరగతి.. ఇంటర్ లలో మిగిలిపోయిన వారికి త్వరలో ఈ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా రైతులకు అన్నదాత సుఖీభవ.. మహిళలకు ఆడబిడ్డ నిధి.. యువతకు నిరుద్యోగ భృతి.. తొందర్లో అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని వివరించారు. టీడీపీ హయంలో మంజూరు చేసిన అయినాడ రోడ్డు ప్రతిపాదనను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పూర్తిగా విస్మరించడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని గంటా తెలిపారు. అయినాడ రోడ్డు మంజూరు చేయించడమే కాకుండా యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే జల్ జీవన్ మెషీన్ ద్వారా మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల అధ్యక్షుడు కోరాడ రమణ, కురిమిన లీలావతి, అనిల్, కె.దామోదరరావు, కె.వెంకటలక్ష్మి, నందీశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో కార్మిక చట్టాలు అమలుచేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచే ఆయా జోన్ల పరిధిలో డ్రైవర్లు, కార్మికులు ఆందోలనకు దిగారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కోస్ కార్మికుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఏళ్ల తరబడి పెండిరగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌తో పాటు ఆరు దఫాలుగా చెల్లించాల్సిన ఎరియర్స్, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పెన్షన్, గ్రాట్యుటీ వంటివి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, నీటి సరఫరా, యూజీడీ కార్మికులకు జీతాలు పెంచాలని, క్యాడర్ వారీ రూ. 21వేలు, రూ. 24,500 పెంచాలన్నారు. స్కూల్ స్వీపర్లు, వాచ్‌మన్లకు జీతాలు పెంచాలని, రిటైరైన వారి స్థానంలో కారుణ్య నియామకాలివ్వాలన్నారు. అన్ని జోనలో ఎమ్మెస్ఎఫల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, వెహికల్ కండిషన్ మెరుగు పర్చాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల్ని రెగ్యులర్ చేయాలని, థర్డ్ పార్టీ కాంటాక్టర్ల వద్ద (ఓ అండ్ఎం) పని చేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలుతో పాటు ప్రతి నెలా జీతాలిచ్చి వారందర్నీ ఆప్కోస్‌లో చేర్పించాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనాల అమలు, పీఎఫ్ చెల్లింపులకు పాల్పడుతున్నవారిపై చర్యలు చేపట్టాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కె. సత్యనారాయణ, కోలా గురుమూర్తి, పెద్ద అప్పారావు, నంబారి రాజు, లింగాల వెంకటేష్, పిట్టా కిషోర్, నూకరాజు, ప్రసాద్, శేఖర్, దేముడు బాబు, సబ్బి రమేష్, కొర్రయి వాసు, సుగుణాకర రాజు, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటి పర్యటన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : మేఘాలయ రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటి స్టడీ టూర్ నిమిత్తం 10వ తేదీ విశాఖపట్నం చేరుకొని రాత్రి బస చేస్తారు. 11వ తేదీ విశాఖ నగరంలో పలు ప్రదేశాలను సందర్శించి రాత్రి బస చేస్తారు. 12వ తేది విశాఖపట్నం నుండి భువనేశ్వర్ వెళ్తారు.

కామ్రేడ్ సన్యాసిరావు కుమారుడు పోతిన రాము మృతి

విశాలాంధ్ర-మల్కాపురం : కీర్తిశేషులు కామ్రేడ్ పోతిన సన్యాసిరావు రెండవ కుమారుడు పోతిన రాము కొన్ని రోజుల క్రితం అనారోగ్యం పాలవడంతో బుధవారం 10 గంటలకు సమయంలో మల్కాపురం ఆయన స్వగృహం తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించిన నేపథ్యంలో పార్టీ నాయకులు సానుభూతిపరుల సందర్శనార్థం మల్కాపురం నగరాల వీధి లో గల ఆయన స్వగృహం ఉంచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముఖ్య ప్రకటన

నా క్లయింటు ఎస్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, కొత్తపేట, అంజనేయ వాగు కాపురస్తురాలు అయిన పోతిన వెంకటేశ్వరరావు గారి భార్య పోతిన అదిలక్ష్మి, హిందు, వయస్సు: 48 సం॥లు గారి యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటుకు వారి తల్లి గారైన కొరగంజి పైడేశ్వరరావు గారి భార్య శాంత కుమారి గారు వ్రాసిన వీలునామా ద్వారా నా క్లయింటుకు సంక్రమించి యున్నది. కొరగంజి శాంత కుమారి గారు సదరు వీలునామాను జాయింటు సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసు, విజయవాడ నందు దస్తావేజు నెం. 109/2018, ది. 28-02-2018వ తేదీన రిజిష్ట్రేషన్ చేయించినారు. దరిమిలా సదరు కొరగంజి శాంత కుమారి గారు సదరు వీలునామాలో ఎట్టి మార్పులు చేర్పులు చేయకుండా అదియే వారి ఆఖరి వీలునామాగా వుంచి ది. 06-12-2022వ తేదీన పరమపదించినారు. వారి మరణానంతరము సదరు వీలునామాలోని అంశముల రీత్యా నా క్లయింటు సదరాస్తిని సర్వ సంపూర్ణ హక్కుభుక్తములతో నిర్వివాదముగా అనుభవించు చున్నారు. ది. 02-07-2025వ తేదీన నా క్లయింటు షెడ్యూలు ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజులు అనగా దస్తావేజు నెం. 1278/86, ది. 19-3-1986 (యస్ఆర్ఒ., విజయవాడ) మరియు ఇతర దస్తావేజులతో కలిపి ఫొటోస్టాట్ తీయించుటకు అంజనేయ వాగు సెంటర్‌నందు గల విజయలక్ష్మి జిరాక్స్ షాపు నందు జిరాక్స్ తీయించి సదరు జిరాక్స్ కాపీలను తీసుకొని ఇంటికి వెళ్ళి చూసుకొనగా సదరు పై తెలిపిన దస్తావేజు నెం. 1278/86 దస్తావేజు కనబడలేదు. సదరు దస్తావేజును గురించి నా క్లయింటు పరిసర ప్రాంతములలో వెదుకగా దస్తావేజు దొరకలేదు. కనుక ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు దస్తావేజు ఎవ్వరికైననూ దొరికినచో నాకు గాని నా క్లయింట్‌కి గాని అప్పచెప్పవలెను. అంతే గాని సదరు దస్తావేజు రీత్యా జరిగే ఎటువంటి లావాదేవీలు, అన్యాక్రాంతములు నా క్లయింట్‌ను గాని షెడ్యూలు ఆస్తిని గాని ఏ విధముగానైననూ బైండ్ చేయజాలవనిన్నీ మరియు నా క్లయింట్ చట్టరీత్యా తీసుకొనబోయే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించవలసి యుంటుందని ముందుగా తెలియజేయడమైనది. షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిష్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ 1 టౌన్, కొత్తపేట, (అంజనేయు పేట) అంజనేయ వాగులో యున్నట్టి ఆస్తికి పాత మున్సిపల్ వార్డు నెం. 4, దరిమిలా మున్సిపల్ వార్డు నెం. 5, ప్రస్తుత మున్సిపల్ వార్డు నెం.9, రెవిన్యూ వార్డు నెం.1, బ్లాకు నెం.7, యన్.టి.యస్. నెం.1247, అసెస్మెంటు నెం.2331, కొత్త అసెస్మెంటు నెం. 25047, డోరు నెం.9-41-7 దాఖలా చ.గ. 102-6-6లు స్థలము ఇందలి గ్రౌండ్, ఫస్టు మరియు సెకండ్ ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి.మేడ బిల్డింగు కట్టడములు వగైరాలతో సహా గల స్థిరాస్తికి హద్దులు: తూర్పు: దుర్గాశి రామస్వామి గారి ఆస్తి అ.37-0లు, దక్షిణం: పైల పరశురామయ్య గారి ఆస్తి అ.28-6లు, పడమర: పచ్చిశెట్టి వెంకటేశ్వరరావు గారి ఆస్తి అ.29-0లు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు కొంత, రాయన సింహాచలమ్మ గారి ఆస్తి కొంత అ. 28-6లు.

ఇట్లు
పట్రా రవికుమార్, ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి., న్యాయవాది
అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-15. ఫోన్: 9908107491
విజయవాడ, ది. 09-07-2025

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, AT HYDERABAD
FA NO. 773 OF 2024

Between:
The CEO, M/s Golbibo, 19th floor, towers A, B & C, DLF building no. 5, Tower B, DLF Cyber City, DLF phase – 2, Sector 25, Gurugram, Haryana – 12202, India
...Appellant/ Opposite Party 1
AND
1. R.N. Abanikant Parida, S/o Narahari Parida, Railway Bungalow No. 872, Gurkha Lane, Near Rail Club, Railway School Road, Visakhapatnam, Andhra Pradesh
... Respondent No.1 / Complainant
2. The Avenue Hotel, Samarat Complex, Tata Kandra Main Road, Gamharia Saraikela – Kharsawan, Jamshedpur, Jharkhand – 832402
...Respondent No.2 / Opposite Party No.2

The Appellant has filed an appeal bearing No. FA. 773 of 2024 before this Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission against the order dated 05.08.2024 in CC No. 118 of 2022 passed by the Ld. District Consumer Disputes Redressal Commission, Visakhapatnam and the case is posted on **25-07-2025.** That the Hon'ble State Commission directed the Appellant for publication of notice in accordance with the rules, therefore, the **Respondent-1** is to attend either in person or through pleader on **25-07-2025 at 10:30 AM,** otherwise the matter will be decided according to the law.

//BY ORDER OF THE COURT//
Sd/-
Deepika Kumari, Anshu Singh and Rohan Singla Of M/s. King Stubb and Kasiva - Advocates and Attorneys, having their office at B 1, RNM Tower, 5th Floor Metro pillar no 331, i4, NH-19, Mohan Cooperative Industrial Estate, New Delhi, Delhi 110044; M: 8960614321.

భూకబ్జాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖలోని గాజువాక ప్రాంతంలో ఇటీవల కాలంలో భూకబ్జాలు అధికమయ్యాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం సంబంధించి ఎమ్మెల్యే ఎవరు అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందన్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగుతుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేకు బదులు వేరొకరు పదవి ను అనుభవిస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా లేనటువంటి వారంతా, అధికారంలోకి వచ్చాక పార్టీని అడ్డం పెట్టుకొని భూకబ్జాలు, సెటిల్మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. గాజువాకలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూములు కబ్జాలు అడ్డుకొనే వారు లేరని, కనీసం అధికారులను చర్యలు తీసుకోవటానికి కూడా స్థానిక ఎమ్మెల్యే కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ ప్రజల కష్ట సుఖాలను గాలికి వదిలేసారన్నారు. ఈ అంశాలు అన్నిటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, తక్షణమే విచారం జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎఫ్ఆర్‌యు హాస్పిటల్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక్ ప్రాంతం పరిధి పరిధిలోని శ్రీహరి పురం గొల్లలపాలెంలో గల ఎఫ్ఆర్‌యు హాస్పిటల్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని సిపిఐ పార్టీ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు బుధవారం 61వ మల్కాపురం గ్రామ మండల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 7 వార్డుల పరిధిలో ఉన్న ఎఫ్ఆర్‌యు ఆసుపత్రిను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పారిశ్రామి ప్రాంతంలో కార్మికులు అసంఘటిత కార్మికులు లేబర్ కాలనీలో ఎక్కువగా ఉన్నవారు ఈఈ ఆస్పత్రిని వినియోగించు కుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రజలకు అందుబాటులో ఉంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. అన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, పైకనకేశ్వరరావు, టి.కామేశ్వరరావు, బి.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేగి పరమేశ్వరరావుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-పెందుర్తి : గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావును బుధవారం పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం పెందుర్తిలో జరిగిన విశాఖ డైరీ వ్యవస్థాపకుడు ఆడారి తులసిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్ల రమాకుమారి విశాఖ డైరీ డైరెక్టర్లు, పాల రైతులు శాలువాలతో సత్కరించి, పూల బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఇటీవల రాష్ట్రస్థాయి పదవులు అధిరోహించిన పరమేశ్వరరావు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. కాగా తనను ఘనంగా సత్కరించిన నాయకులు విశాఖ డైరీ డైరెక్టర్లు పాల రైతులకు పరమేశ్వర కృతజ్ఞతలు తెలియజేశారు.

మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-సింహాచలం : గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్. టి.ఎల్ సి.ఈ.యునియాన్ పెన్షన్ పద్దతి, కారుణ్య నియామకాలు చేపట్టాలని శాంతియుతంగా గేట్ సమావేశం నిర్వహించి ఎం.ఎస్.టి.ఎల్, డి.ఆర్.డి.ఈ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో ఎన్.పీఎస్/యూపీఎస్ స్థానంలో పాత పెన్షన్ పథకం (ఓ.పీ.ఎస్) పునరుద్ధరణ, 2004లో ఎన్. పీ.ఎస్ ప్రవేశపెట్టడం, దాని తర్వాత యు.పీ.ఎస్ ప్రతిపాదన రక్షణ పౌర శ్రామిక-తరగతి ఉద్యోగులలో విస్తృతమైన అసంతృప్తి , అభద్రతకు దారితీశాయి. జీవితాంతం దేశానికి సేవ చేసే వారు ఇప్పుడు వారి వృద్ధాప్యంలో అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు అనేది నిరుత్సాహపరుస్తుంది. ఓ.పీ.ఎస్ పునరుద్ధరణ డిమాండ్ కేవలం ఆర్థిక సమస్య కాదు - ఇది సామాజిక భద్రత, గౌరవం, సహజ న్యాయం యొక్క ప్రశ్న అని అన్నారు కాంట్రాక్టు, పెన్షనర్ల పునః ఉపాధి మరియు స్థిరకాల ఉపాధిని నిలిపి వేయండి - ప్రత్యక్ష నియామకం ద్వారా అన్ని ఖాళీలను భర్తీ చేయాలి అని కోరారు. కాంట్రాక్టు లేదా స్థిరకాల ఉపాధి ప్రాతిపదికన వ్యక్తులను నియమించే కొనసాగుతున్న పద్ధతి శ్రామిక శక్తి మరియు ఉద్యోగార్థి యువతలో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. ఇటువంటి తాత్కాలిక ఏర్పాట్లు ఉద్యోగుల ఉద్యోగ భద్రత మరియు సామాజిక సంక్షేమాన్ని దెబ్బతీయడమే కాకుండా సంస్థలో దీర్ఘకాలిక జవాబుదారీతనం మరియు నిబద్ధత లోపానికి దారితీస్తాయి. వివిధ ప్రయోగశాలలు మరియు వర్గాలలో ఉన్న మరియు మంజూరు చేయబడిన అన్ని ఖాళీ పోస్టులను ప్రభుత్వ నిబంధనలు మరియు రిజర్వేషన్ విధానం ప్రకారం ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేయవచ్చు. కార్మిక వ్యతిరేక 4-కార్మిక కోడ్‌లు 2020ని ఉపసంహరించుకోవాలని, ఈ కోడ్‌లు కార్మికుల ప్రతినిధులతో తగినంత సంప్రదింపులు లేకుండానే అమలుచేయబడ్డాయి, పార్లమెంటులో అర్థవంతమైన చర్చను దాటవేయబడ్డాయి. వాటి అమలు ఉపాధిని మరింత అస్థిరపరుస్తుంది, ఉద్యోగ భద్రతను తగ్గిస్తుంది మరియు శ్రామిక ప్రజల గౌరవం, హక్కులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 100% కారుణ్య నియామకానికి ఉత్తర్వు జారీ చేయండి అనే సమాచారం ఉంది.

ప్రజా సుపరిపాలనకు ఏడాది పూర్తి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : ప్రజలు మెచ్చిన, నచ్చిన ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం భీమిలి జోన్ 3వ డివిజన్ నేరెళ్లవలస కోలనీలో గంటా నూకరాజు ఆధ్వర్యంలో సుపరిపాలన -ముందడుగు కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ద్వారా ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలన కారణంగా ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం కూరుకుపోయిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా ఫించన్ 4,000 రూపాయలకు పెంచారని, ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేశారని, ఆగస్టు నెల నుండి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు అవుతుందని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగుల కళ్లల్లో ఆనందం నింపారని అన్నారు. ల్యాండ్ టైటలింగ్ చట్టం రద్దుతో ప్రజల గుండెల్లో ఎక్కడ లేని ఆనందం వెల్లువిరిచిందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకొని పాలన సాగిస్తున్న కూటమి సర్కార్ ను రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించారని, ఇంకా మన పిల్లల భవిష్యత్తు కోసం రాబోయే రోజుల్లో కూడా కూటమి పాలనకు అండగా ఉండాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, పైడిపల్లి నర్సింగరావు, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, జలగడుగుల మురళి, పుక్కళ్ళ లక్ష్మీ కుమారి, వియ్యపు పోతురాజు, వియ్యపు నాయుడు, నెక్కెళ్ళ వెంకటరావు, రేగాని శంకర్, కర్రి శివ, శ్రీనివాసరావు మాస్టర్, ఏనుగుతల నర్సింగరావు, దౌలపల్లి హరీష్, రాము, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు ఆడారి తులసీరావు

పెందుర్తి విగ్రహావిష్కరణలో కొనియాడిన నేతలు



విశాలాంధ్ర-పెందుర్తి : విశాఖ డైరీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఆడారి తులసీ రావు ఉత్తరాంధ్ర రైతుభాంధవుడు అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ తదితర ప్రముఖులు కొనియాడారు. పెందుర్తిలోని విశాఖ మిల్క్ బల్క్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఆడారి విగ్రహాన్ని పంచకర్ల రమేష్ బాబు పిల్ల గోవింద సత్యనారాయణ, మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆడారి సమాజానికి అందించిన సేవలను నేతలు ప్రస్తుతించారు. రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి రైతు బాంధవుడిగా నిలిచిపోయారని పేర్కొన్నారు ప్రస్తుత చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తులసిరావు అడుగుజాడల్లోనే నడుస్తూ రైతులకు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు .కార్యక్రమంలో ఆడారి తులసిరావుతో సమకాలికుడు లక్కవరపుకోట డైరెక్టర్ కోళ్ల కాటమయ్యను అందరూ ఘనంగా సత్కరించారు. విశాఖ డైరీ డైరెక్టర్ సరగడం శంకర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోషి , బడేటి రవి ,గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వర రావు, మాజీ మార్కెట్ చైర్మన్ వేగి దివాకర్, వార్డు అధ్యక్షులు డిబీఎల్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు, కొరుపోలు రామానాయుడు, కరకదేవుడు, మాజీ జెడ్పిటిసి సభ్యులు రెడ్డి నారాయణరావు, అయితే సింహాచలం నాయుడు, గొర్లి అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, ఉగ్గిన దేవుడు, అక్కిరెడ్డి నరసింహామూర్తి, ఉగ్గిన అచ్చి బాబు, గొర్లి రామకృష్ణ, గొల్లవిల్లి రమణ, రాపర్తి కిషోర్, సదరం భీమేశ్వరరావు, పెర్రి శివ, బైలపూడి హర గోపాల్, నగేష్, కోరుపల్లి సుందర్‌రావు, ముదునూరి కిరణ్, గన్రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

68, 71 వార్డులలో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర-విశాఖపట్నం : పారిశ్రామిక నగరమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు జీవిఎంసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగిందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ గాజువాక నియోజకవర్గం పరిధిలో 68, 71 వార్డులలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వార్డ్ కార్పొరేటర్లు రాజాన రామారావు, గుడివాడ వెంకట సాయి అనూష లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ముఖ్యంగా పారిశ్రామిక నగరమైన గాజువాక పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అధిక శాతం నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. బుధవారం 68వ వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, గోవింద అప్పన్న కాలనీ, మింది, చిన్న అక్కిరెడ్డిపాలెం తదితర ప్రాంతాలలో సుమారు రూ.236.05 లక్షలు జీవీఎంసీ నిధులతో వి ఆర్ సి సి డ్రెన్, సిసి రోడ్లు, సిసి కల్వర్టులు, సిసి డ్రెన్లు, బిటి రోడ్లు, ఎస్ డబ్ల్యూ డ్రెన్ మొదలైనవి అలాగే 71వ వార్డు పరిధిలోని కుంచుమాంబ కాలనీ, విశ్వేశ్వరయ్య నగర్, ఆటోనగర్, శ్రీరామ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ.79.41 లక్షలు జీవీఎంసీ నిధులతో సిసి రోడ్లు, సిసి డ్రెన్లు మొదలైన అభివృద్ధి పనులకు రెండు వార్డులలో కలిపి మొత్తంగా రూ.315.46 లక్షల వ్యయం తో శంకుస్థాపన చేశామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు గాజువాక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని మేయరు కొనియాడారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ గాజువాక పరిధిలోని ప్రతి వార్డును జీవీఎంసీ ఎమ్మెల్యే నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖలోని పారిశ్రామిక నగరమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని, అంచలంచెలుగా గాజువాకను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నేడు 68, 71 వార్డుల లో సుమారు రూ.315.46 లక్షలు వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. నగర మేరుగా పీలా శ్రీనివాసరావు నగరాభివృద్ధిపై దృష్టి చారించి విశాఖ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్నాథం, బొడ్డు నరసింహ పాత్రుడు, కార్యనిర్వాహక ఇంజినీరు ఎమ్.ఆర్.ఎస్ అపారావు, ఎమినిటీస్ కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె సక్సెస్.. పుర వీధుల్లో భారీ ర్యాలీ

ఐక్యంగా కదిలిన శ్రమ జీవులు

విశాలాంధ్ర-తగరపువలస : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు ఐక్యంగా కదిలారు. ఆశా, అంగన్వాడీ, ఎం డి ఎం, వి ఓ ఎ లు, ఆటో, ముఠా, జి వి ఎం సి పారిశుధ్య కార్మికులు,ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు, పింఛను దారులు ఇలా ఒక రంగానికి పరిమితం కాదు అనేకానేక రంగాల కార్మికులు, శ్రమ జీవులు ఒక్కటిగా కదలడంతో బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మె సక్సెస్ అయింది. సి ఐ టి యు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చిట్టి వలస సిఐటియు కార్యాలయం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ జ్యూట్ కార్మిక వాడ మీదుగా జంక్షన్, భీమిలి రోడ్డు, గొల్ల వీధి, గ్రంథాలయం వీధి, వై జంక్షన్, మెయిన్ రోడ్డు, రాములమ్మ థియేటర్ మీదుగా జంక్షన్‌కు చేరింది. అనంతరం మానవహారం నిర్మించారు.మండుటెండను సైతం లెక్క చేయకుండా ర్యాలీలో కార్మికులు పాల్గొన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లకు నెలకు రూ 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికుల కు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నెలకు కనీస పింఛను రూ 9 వేలు అందించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ర్యాలీ ఆద్యంతం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నాయకులు దా బి గంగా రావు, ఆర్ ఎస్ ఎన్ మూర్తి, ఎస్ అప్పల నాయుడు,రవ్వ నరసింగరావు వివిధ రంగాల కార్మికులు, ఆయా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నం గాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన స్థానిక నేతలు

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం ఎంపీపీ రాంబాబుకు స్థానిక నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీపీ కంటుబోతు రాంబాబు తన తండ్రి తరువాత వారసత్వంగా రాజకీయాన్ని కొనసాగిస్తూ స్థానిక గ్రామంలోనే కాక మండలమంతా కూడా ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేకముద్ర వేసుకున్నారని వారన్నారు .తనకు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలను ప్రసాదించాలని రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారన్నారు .అనంతరం రాంబాబుకు పూల బొకేలు ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కటింగ్ చేశారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వీడిన ఉత్కంఠ

మండల తహసిల్దార్‌గా సురిశెట్టి శ్రీనుబాబు

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండల తాసిల్దార్ నియామకానికి ఉత్కంఠ వీడింది. ఇదివరకు వెలువడిన కలెక్టర్ బదిలీల్లో భాగంగా శ్రీవల్లిని ఇక్కడ నియమించినప్పటికీ ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టలేదు. గత కొన్ని రోజులుగా మండలంలో తాసిల్దార్ నియామకం లేక నీలి నీడలు అలుముకున్నాయి. మంగళవారం విడుదల చేసిన బదిలీలో భాగంగా నూతన ఎమ్మార్వోగా శ్రీనుబాబును నియమించడం పట్ల ఉత్కంఠకు తెరపడింది. అందులో భాగంగా ఆనందపురం మండలం తహసిల్దారుగా సురిసెట్టి శ్రీనుబాబు బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. మంగళవారం జిల్లా కలెక్టర్ విడుదల చేసిన బదిలీలో భాగంగా ఇక్కడికి శ్రీనుబాబును కలెక్టర్ తహసిల్దార్‌గా నియమించారు. గతంలో ఈయన భీమునిపట్నం మండలంలో డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో రైతులు భూ సమస్యలను పరిష్కారం కృషి చేస్తానని ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లయితే అలాంటి ఆక్రమదారులపై కఠిన చర్యలు తీసుకుంటానని, ఎల్లప్పుడూ రైతులకు, మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. డిప్యూటీ తాసిల్దార్ చేతన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పలువురు నూతన తాసిల్దార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

మానవ హక్కుల సభ్యత్వ సర్టిఫికేట్‌లు అందజేత

విశాలాంధ్ర-తగరపువలస : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ డా.గోపి నాయక్ పిలుపుతో బుధవారం తగరపువలస జీవియంసి సామాజిక భవనంలో సభ్యత్వ పత్రాలను అందించే కార్యక్రమం జాతీయ కార్యదర్శి భాగం స్వాతి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథులుగా జగ్గుపిల్ల ప్రసాద్ - డబ్బీర్ ప్రశాంతి పట్నాయక్ - బింగి హరి కిరణ్ రెడ్డి - ఇల్లాపు వెంకట్ జగన్ - బొడ్డు దుర్గారావు - కొయ్య రామకృష్ణ రెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులు లీగల్ సర్వీస్ కౌన్సిల్ లోగో ఆవిష్కరణ చేసి సభ్యులు కు సభ్యత్వ పత్రాలను సభ్యులకు అందివ్వడం చేసారు. అనంతరం సమాజంలో చాలా మంది కి మానవ హక్కుల పై అవగాహన లేదని తమ తమ హక్కులను ఎలా పొందాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని,ఇది అలుసుగా తీసుకుని సమాజంలో అధికారంతో ఎంతో మంది బలహీనులు పట్ల వారి అజమాయిషీ చూపడం అంత మాత్రమే కాక వారికి అన్యాయం చేయడం చేస్తున్నారని అలా అన్యాయంకి గురువు తున్న వారి పక్షాన నిలిచి న్యాయం చేసే విషయంలో ముందుండే ఆయంథమే మానవ హక్కుల వ్యవస్థ అని మాట్లాడారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మానవ హక్కుల సభ్యులు ఎక్టివిస్టులు పాల్గొన్నారు.

ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను ఆవిష్కరించిన సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : దక్షిణ కొరియా టెక్ దిగ్గజం సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తమ తాజా ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను బుధవారం నుండి అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. తమ దూరదృష్టి, భవిష్యత్తును రూపొందించే ధైర్యమైన ఆలోచనలకు సామ్‌సంగ్ ప్రసిద్ధి చెందింది. కాబట్టి సామ్‌సంగ్ దాని సంస్కృతి, సృజనాత్మకత, సహకారానికి ప్రసిద్ధి చెందిన ప్రదేశంలో గెలాక్సీ పోర్ట్‌ఫోలియోకు తాజా మరియు గొప్ప జోడింపులను తీసుకువచ్చింది అన్నారు. ఇప్పుడు ఏడవ తరంలో ఉన్న తమ రాబోయే ఫోల్డబుల్‌లు అన్నింటికంటే సన్ననివి, తేలికైనవి మరియు అత్యంత మన్నికైనవిగా ఉంటాయని చెప్పారు 2019లో మొదటిసారిగా పరిచయం చేసిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్, స్మార్ట్‌ఫోన్ యొక్క పోర్టబిలిటీని టాబ్లెట్ యొక్క విస్తృత ఉత్పాదకతతో మిళితం చేసి, వినియోగదారుల కోసం కొత్త మడతపెట్టే (ఫోల్డబుల్) స్మార్ట్‌ఫోన్‌ల విభాగానికి నాంది పలికిందన్నారు. తమ ఇంజనీర్లు, డిజైనర్లు గెలాక్సీ జెడ్ సిరీస్‌లోని ప్రతి తరంను మునుపటి కంటే సన్నగా, తేలికగా మరియు మన్నికగా ఉండేలా మెరుగుపరుస్తున్నారని, కొత్త ఫోల్డబుల్ పరికరాలు మరింత శక్తివంతమైన, ఉత్సాహపూరితమైన, లీనమయ్యే కెమెరా వ్యవస్థను కలిగి ఉంటాయని సూచిస్తూ, సామ్‌సంగ్ కెమెరా ఆవిష్కరణలను కూడా టీజ్ చేసింది అని అన్నారు.

వర్షాకాలంలో చర్మ రక్షణకు ఆయుర్వేద ఆహారం డాక్టర్ మధుమితకృష్ణన్

విశాలాంధ్ర-విశాఖపట్నం : వర్షాకాలంలో, చర్మం నిస్తేజంగా, నిర్జీవంగా, ఎటువంటి మెరుపు లేకుండా కనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన నివారణల కోసం చూస్తారు, ఇవి కొన్నిసార్లు తాత్కాలిక ఉపశమనాన్ని అందిస్తాయి కానీ, వీటిని పలుమార్లు ఉపయోగించాల్సి రావటం వల్ల దద్దుర్లు, నల్ల మచ్చలు, దురద మొదలైన ప్రతికూల ప్రభావాలు ఉండవచ్చు. ఈ కారణం చేతనే , ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్, సరైన చర్మ ఆరోగ్యాన్ని , లోపల నుండి మొత్తం శ్రేయస్సును అందించడానికి సరళమైన సహజ నివారణలను ఆశ్రయించాలని సిఫార్సు చేస్తున్నారు. బాదం, హెర్బల్ టీలు, పసుపు వంటి సహజ ఆహారాలను మీ ఆహారంలో చేర్చడంతో పాటుగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంపై దృష్టి పెట్టాలని, బుద్ధిపూర్వక ఆహార ఎంపికలు చేసుకోవాలని ఆమె సిఫార్సు చేస్తున్నారు. శుభ్రమైన ఆహారం మూడు దోషాలను వాత, పిత్త మరియు కఫాలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుందని ఆయుర్వేదం సూచిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన చర్మానికి కీలకం మంచి జీవక్రియ.

బాదం వంటి పోషకమైన ఆహారాలను చేర్చండి : వాత దోషాన్ని సమతుల్యం చేసే సామర్థ్యం ఉన్న బాదం, సీజన్ యొక్క అసమతుల్యతను సరి చేయటమే కాకుండా, శరీరాన్ని శక్తివంతం చేయడానికి, లోపలి నుండి కణజాలాలను పునరుజ్జీవింపజేయడానికి కూడా సహాయపడుతుందన్నారు. వాస్తవానికి, భారతదేశం అంతటా ప్రజలు విస్తృతంగా అనుసరించే సాంప్రదాయ ఆయుర్వేద ఔషధాలలో బాదం ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. చర్మ ఆరోగ్యం విషయానికి వస్తే, ఆరోగ్యకరమైన, మెరిసే చర్మాన్ని సాధించడానికి బాదంను రోజువారీ చిరుతిండిగా జోడించమని డాక్టర్ మధుమిత సిఫార్సు చేస్తున్నారు. ఆయుర్వేదం, సిద్ధ మరియు యునాని సంప్రదాయాల నుండి ప్రచురించబడిన గ్రంథాలు చర్మ ఆరోగ్యానికి బాదం యొక్క ప్రయోజనాలను వెల్లడించాయి, చర్మ ప్రకాశాన్ని పెంచే సామర్థ్యాన్ని నొక్కి చెబుతాయి.

ఆహారంలో హెర్బల్ టీలను జోడించడానికి ప్రయత్నించండి : అల్లం, తులసి (పవిత్ర తులసి) మరియు చమోమిలే వంటి హెర్బల్ టీలు శరీరాన్ని నిర్విషీకరణ (డిటాక్సిఫికేషన్) చేయడానికి మరియు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి, ఇది చర్మ ఆరోగ్యమును ప్రోత్సహిస్తుంది. ఈ హెర్బల్ టీలు దోషాలను (వాత, పిత్త, కఫ) సమతుల్యం చేస్తాయి, మంటను తగ్గిస్తాయి, మొటిమల వంటి చర్మ సమస్యలను నివారించడంలో సహాయపడతాయి అని చెప్పారు.

తల్లిదండ్రుల సమావేశానికి ఘనంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర-అనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశానికి భారీగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని శాసన సభ్యుల సానిధ్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేస్తోంది. మండల విద్యాశాఖ అధికారులు జోగేంద్ర రావు, గంగరాజులు దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశానికి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని సరికొత్త అందాలతో అలంకరిస్తున్నారు. క్రీడామైదానాన్ని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, నరసింహమూర్తి, బుజ్జి తదితరులు రోలర్ వాహనంతో చదును చేస్తున్నారు. పాఠశాల పరిసరాలను హరితవనంగా మార్చేందుకు ఉపాధ్యాయులు ముత్యాలయుడు నేతృత్వంలో మొక్కలు నాటారు.అలాగే తరగతి గదులను విద్యార్థులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుడు ప్రేమ్ కుమార్ డ్రాయింగ్ బొమ్మలతో అలంకరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా హాజరయ్యే అవకాశముండటంతో ఏర్పాట్లలో ఏ విఘ్నం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాఠశాల అభివృద్ధిని, విద్యార్థుల భవిష్యత్‌ను తల్లిదండ్రులకు పరిచయం చేసేందుకు ఈ సమావేశం ఎంతగానో దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రకటనకే పరిమితమైన రైల్వే జోన్

విశాలాంధ్ర-విశాఖపట్నం : 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం మంజూరైన దక్షిణ కోస్తా రైల్వే ప్రారంభించడానికి అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియర్ జనరల్ సెక్రెటరీ సీహెచ్ శంకరరావు విమర్శించారు. జోన్ ప్రకటించిన ఐదు సంవత్సరాల వరకు డీపీఆర్ సిద్ధం చేయటానికి కూడా చొరవచూపలేదని, ఎట్టకేలకు 2019 మార్చిలో డీపీఆర్ సిద్ధం చెయ్యటానికి ఓఎస్‌డీను నియమించారని, ఎట్టకేలకు 2019 ఆగష్టు 26 న రైల్వే బోర్డుకు డీ పీ ఆర్ సమర్పించారని ప్రకటనలో తెలిపారు. వెంటనే డీపీఆర్ ఆమోదించాల్సి గెజిట్ నోటిఫికేషన్ జారీచేయాల్సిన కేంద్రప్రభుత్వం ఎట్టకేలకు 2019 డిసెంబర్ 26 న దక్షిణ కోస్ట్ రైల్వే జోన్ ఆమోదించిందని తెలిపారు. కాబినెట్ ఆమోదం పొందిన తర్వాత కూడా అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చెయ్యలేదని తద్వారా భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక కొత్త జోన్ ఏర్పాటు మరింత ఆలస్యమైందని తెలిపారు.గతంలో రైల్వే శాఖా మంత్రిగా పనిచేసిన రామ్ విలాస్ పాశ్వాన్ సమయంలో ఏర్పాటుచేసిన ఏడూ రైల్వే జోన్‌ల విషయంలో వెంటనే గెజిట్ నోటిఫికేషన్ జరీ చేసి వెంటనే పనులు ప్రారంభించారని, అద్దె భవనాల్లో ఆయా జోన్లకు కార్యాలయాలు ఏర్పాటుచేశారని తెలిపారు. దక్షిణ కోస్ట్ రైల్వే జోన్‌కు అద్దె భవనంలో కార్యాలయం నిర్వహించేందుకు నిరాకరించి సవతి తల్లి ప్రేమ చూపించారని విమర్శించారు.గత ఆరునెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో భవనాలకు కేటాయించిన భూముల విషయంలో క్లియరెన్స్ లభించిందని,అనంతరం ఈ సంవత్సరం జనవరి 8 న ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేసారని తెలిపారు. శంకుస్థాపన చేసి ఆరునెలలైనా అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, జూన్ ఐదున ఎటువంటి అధికారాలు లేకుండా జనరల్ మేనేజర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసారని శంకరరావు విమర్శించారు. దక్షిణ మధ్య రైల్వేలోని మూడు జోన్‌లు విజయవాడ, గుంతకల్, గుంటూరు ఇప్పటికీ దక్షిణ మధ్య రైల్వే జీఎం నియంత్రణలోనే ఉన్నాయని, అదేవిధంగా వాల్తేరు డివిజన్,రాయగడ డివిజన్‌లు ఇప్పటికీ ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం నియంత్రణలోనే ఉన్నాయని విమర్శించారు.అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయకుండా దక్షిణ కోస్తా రైల్వేకు జీఎంను నియమించడంతో నాలుగు డివిజన్లతో నిర్వహించే రోజువారీ కార్యకలాపాలతో ఎటువంటి అధికారాలు లేవని తెలిపారు.దక్షిణ కోస్తా రైల్వేకు జీఎంను నియమించి కొత్త జోన్ ప్రారంభించిందని ప్రజలను నమ్మించారని విమర్శించారు.దేశానికి స్వాతంత్రం వచ్చిన అత్యంత శుభదినమైన ఆగష్టు 15న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ విడుదల చెయ్యాలని శంకరరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ చర్యలు తీసుకోవాలని కోరారు.విశాఖ వాసుల కల నెరవేరేలా దక్షిణ కోస్తా రైల్వే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చెయ్యాలని శంకరరావు కోరారు.

తగరపువలస : బుధవారం దేశవ్యాప్తంగా పబ్లిక్ రంగ అసంఘటిత కార్మికులకు నష్టాలు చేసే కార్మిక చట్టాలను రద్దు చేయాలని కార్మికులకు నష్టం తెచ్చే చట్టాలను రద్దు చేయాలని భారతదేశం మొత్తం మీద కార్మికులు బందు చేశారు. పెన్షనర్స్ కూడా అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస ఫించను 7500 రూపాయలు పెంచవలసిన బాధ్యత ఉన్నప్పటికీ కూడా మొండి వైఖరితో పెన్షనర్స్ ని పట్టించుకోకుండా వారి గొప్పలు చెప్పుకోవడం తప్ప మొండితనం వీడలేదు .ఒకపక్క ధరలు విపరీతంగా ఆకాశం అందుతుంటే కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు తో పేదవాడు ఉద్యోగులు ఏం తిని బ్రతకాలని ఈ ప్రభుత్వం ఆలోచన చేస్తుందో ఒకసారి పునర ఆలోచన చేయాలని చిట్టివలస జూట్ మిల్క్ పెన్షనర్స్ అండ్ ఆల్ పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ బందులో భాగంగా పెన్సనర్ సంఘం కూడా బాధ్యత తీసుకొని పోరాటానికి చెయ్యాలని పురవీధుల్లో తిరిగి ఎర్రజెండాలు చేతపట్టి హక్కుల కోసం పోరాడే జెండా ఎర్రజెండా ఒకటేనని తెలియజేశారు. చిట్టి వలస జూట్ మిల్లు పెన్షనర్ సంగం అండ్ ఆల్ పెన్షనర్స్ అధ్యక్షులు కానూరు రాంబాబు మాట్లాడుతూ పెన్షనర్స్ హక్కుల కోసం పోరాటం చేసి సాధించుకోవాలని తెలియజేశారు. సంఘం సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు విపరీతంగా పెరిగిపోతున్న ఈ సందర్భంలోనూ కూడా మానవతా దృక్పథం తోటి ఆలోచన చేసి ప్రధానమంత్రి మోడీ ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఆలోచన చేసి కార్మిక ఉద్యోగ పింఛన్లకు పెరుగుదలకు మంచి ఆలోచన చేసి కార్మికులకు ఉద్యోగులకు కేంద్ర గవర్నమెంట్ ఇచ్చే పెన్షన్ మీద మంచి ఆలోచన చేస్తారని చిట్టివలస జూట్ మిల్ పెన్షన్ సంఘం సహాయ కార్యదర్శిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని కోరారు. కార్మిక ఉద్యోగస్తులు బందు నిర్వహించే ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనువిప్పు కలిగించేటట్టుగా కార్మికులును చులకన భావంతో చూడకుండా కార్మిక సమస్యలు పరిష్కారం కై కృషి చేస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు. రిటైర్మెంట్ పెన్షనర్లకు రైలు ప్రయాణాల్లో చార్జెస్ రాయితీ కల్పించాలని అలాగే హెల్త్ కార్డులు మంజూరు చేసి అన్ని హాస్పిటల్ లో వైద్యం చేసుకునే వెసులుబాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని చిట్టివలస జూట్ మిల్స్ పెన్షనర్స్ అండ్ అల్ పెన్షనర్స్ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఫెన్షనర్స్ గోక అప్పన్న మాదాబత్తుల అప్పలరాజు రాము సింగిడి అప్పారావు చిల్ల అప్పారావు సన్నీ బాబు లక్ష్మణరావు మొదలగు పెన్షనర్స్ పాల్గొన్నారు.

త్వరలో విశాఖ కేంద్రంగా ఇసాయ్‌ఫార్మా జిసిసి ఏర్పాటు

గీతంను సందర్శనలో ఇసాయ్‌ఫార్మా సిఐఓ వెల్లడి

విశాలాంధ్ర-మధురవాడ : ప్రముఖ ఔషధ పరిశ్రమ ఇసాయ్ ఫార్మా త్వరలో విశాఖ కేంద్రంగా గ్లోబల్ కేపబిలిటి సెంటర్ (జిసిసి) ని ఏర్పాటు చేయనున్నదని దీనికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తోందని ఇసాయ్ ఫార్మా అంతర్జాతీయ ప్రతినిధి (గ్లోబల్ సిఐఓ) మకోటో హెూకెట్సు వెల్లడించారు. ఇసాయ్ ఫార్మా ప్రతినిధి బృందంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని బుధవారం 09-0762025న సందర్శించిన ఆయన విశాఖ పార్లమెంట్ సభ్యుడు మరియు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, ప్రో వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తదితరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇసాయ్ ఫార్మా గ్లోబల్ సిఐఓ మకోటో హెూకెట్సు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఔషధ రంగంలో మార్పు దిశగా తమ సంస్థ ప్రణాళికలు రూపొందించిందని అందులో భాగంగానే విశాఖలో గ్లోబల్ కేపబిలిటి సెంటర్ (జిసిసి) ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనికి అవసరమైన మానవ వనరులు, పరిశోధన సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తో కలసి పని చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం అందిస్తున్న కంప్యూటర్ సైన్స్ వంటి సాంకేతిక విద్య కోర్సులు, బోధన అంశాలు, పరిశోధనల గురించి తెలుసుకున్నారు. ఔషధ పరిశ్రమల రంగానికి అవసరమైన విధంగా గీతం సహకారం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో విశాఖలో టిసిఎస్, క్యాప్‌జెమిని, గూగుల్ వంటి సంస్థలో త్వరలో తమ కార్యకళాపాలు ప్రారంభించనున్నాయని ఇసాయ్ ఫార్మా జిసిసి ఏర్పాటు ప్రత్యేక విశాఖలో ఆకర్షణ కాగలదని అభిప్రాయ పడ్డారు. నైపుణ్యం గల మానవ వనరులకు విశాఖలో కొదవలేదని పేర్కొన్నారు. ఇసాయ్ ఫార్మా ప్రాధమిక దశలో గీతంలోని రసాయన శాస్త్ర ప్రయోగశాలలను ఉపయోగించుకుందని అలాగే విశాఖలో జిసిసి ఏర్పాటులో గీతం సహకరం ఉంటుందన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ విశాఖలోని ఫైజర్, దివీస్, లారస్ ల్యాబ్ వంటి ఔషధ పరిశ్రమలకు అవసరమైన విధంగా కోర్సులను రూప కల్పన చేసామని తెలిపారు. ఇసాయ్ ఫార్మాకు అవసరమైన విధంగా నైపుణ్యం గల మానవ వనరులను అందించడానికి సిద్దంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గీతం సీనియర్ ప్రొఫెసర్‌లు అరుణ్ కుమార్, శాంతి చిలుకూరి, భరణి చంద్రకుమార్, కె.వి.ఉమాదేవి, గీతం ఐటి విభాగం డైరక్టర్ వి.సాయిరామ్, ఇసాయ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మరియు విశాఖ అధిపతి డాక్టర్ గిరీష్‌దీక్షిత్, మానవవనురల విభాగం అధిపతి డాక్టర్ హేమంత్‌నిక్కమ్, ఐటి విభాగం అధిపతి జోసఫ్ కిరణ్‌కుమార్, ప్రాజెక్టులు, ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఆనంద్‌గోల్‌పాడే తదితరులు పాల్గొన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మూర్తి ప్రయోగ శాలలలో జరుగుతున్న అధ్యయనాలను గీతం విశిష్ట ప్రొఫెసర్ బి.వెంకటరావు టాటా వివరించారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ పరిశీలన

భక్తులకు కల్పించే ఏర్పాట్లలో జాగ్రత్తలు పాటించండి

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ నగరంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఏర్పాట్లలో జాగ్రత్త పాటిస్తూ ,అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని అధికారులను, ఉద్యోగులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజనీర్లు పి వి సత్యనారాయణ రాజు, గోవిందరావులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో ముందుగా కమిషనర్ నడక మార్గంలో భక్తుల కొరకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు హెల్ప్ లైన్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను, వాటి స్వభావాలను, సంబంధిత రిపోర్టులను పరిశీలించి ఆయా సమస్యలపై సమీక్షించారు. టోల్ ఫ్రీ నెంబర్లు ద్వారా స్వీకరిస్తున్న ఫిర్యాదులు నిశితంగా పరిశీలించి సమస్యలు పరిష్కార దిశగా విధులు నిర్వహించాలని ఆపరేటర్లకు ఆదేశించారు. భక్తులు నడక మార్గంలో అలసిపోయి ఉంటారని వారి నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సహనంతో స్వీకరించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలని, షిఫ్ట్ మారినప్పుడు కూడా సమన్వయంతో ఆపరేటర్లు చిత్తశుద్ధితో 24 గంటలు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సత్యనారాయణ రాజుకు కమిషనర్ అదేశించారు. అనంతరం లుంబిని పార్క్ , వెంకోజి పాలెం వద్ద ఏర్పాటుచేసిన త్రాగునీటి పాయింట్లను సందర్శించి భక్తులకు అందించే సేవలో నిమగ్నమై ఉండాలని ఎమినిటీస్ కార్యదర్శులకు కమిషనర్ ఆదేశించారు. ఆ సమీపంలో ప్రసాద వితరణ జరుపుతున్న స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడుతూ ప్రసాదాలను పర్యావరణహితమైన వస్తువులలో మాత్రమే భక్తులకు అందించాలని ,అలాగే ప్రసాదాల కు సంబంధించిన వ్యర్థాలను సమీప డస్ట్ బిన్లలో మాత్రమే భక్తులు వేయాలని వారికి అవగాహన పరచాలని స్వచ్ఛంద సంస్థలకు కమిషనర్ సూచించారు. నడక మార్గంలో వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించి డస్ట్ బిన్లలో వేసి పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని సహాయక వైద్యాధికారి బి.ప్రసాద్ రావు ను కమిషనర్ ఆదేశించారు. నడక మార్గంలో వ్యర్థాలు డస్ట్ బిన్లలో నిండిపోతున్నందున వాటిని ఎప్పటికప్పుడు తొలగించి తరలించేలా చర్యలు చేపట్టాలని, పబ్లిక్ టాయిలెట్ల వద్ద పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహణలో అప్రమత్తంగా ఉండేటట్లు చూడాలని, ఉచిత వైద్య శిబిరాల వద్ద ప్రజలకు అందించే ఆరోగ్య రక్షణ సేవలను గమనించాలని ప్రధాన వైద్యాధికారికి కమిషనర్ ఆదేశించారు. నడక మార్గంలో ఏర్పాటు చేసిన త్రాగునీటి కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు త్రాగునీటిని గమనిస్తూ సరిపోయినంత బబుల్ నీటి క్యాన్లను ఏర్పాటు చేసుకోవాలని, ఎమినిటీస్ కార్యదర్శులు అందిస్తున్న సేవలను గమనించి విధి నిర్వహణలో వారిని అప్రమత్తం చేయాలని, టాయిలెట్లు వద్ద సరిపోయినంత నీటిని ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎస్ రవికి, నడక మార్గం లో ఎక్కడా కూడా చీకటి లేకుండా ఏర్పాటుచేసిన లైట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ విధులు నిర్వహించాలని కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీధర్ కు కమిషనర్ ఆదేశించారు. భక్తులకు నడక మార్గంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని సదుపాయాలను, సేవలను అందిస్తూ గిరి ప్రదక్షణను విజయవంతం చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. భక్తులు నడక మార్గంలో పయనిస్తున్న వారి రక్షణ దిశగా నిశిత పరిశీలన కొరకు మొట్టమొదటిసారిగా భక్తుల రాకను గమనించేందుకుగాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో ముఖ ఆధారిత లెక్కింపు ప్రక్రియను నిక్షిప్తం చేసేందుకుగాను జీవీఎంసీ ట్రాఫిక్ సిగ్నల్ నిర్వహణకు సంబంధించిన సి ఎం ఎస్ ఏజెన్సీ సహకారంతో ప్రస్తుతం ఉన్న కెమెరా యాక్సెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడమైనదని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నడక మార్గంలో కమిషనర్ పయనిస్తూ భక్తుల కొరకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను, ఏర్పాట్లను గమనిస్తూ సంబంధిత అధికారులకు, ఉద్యోగ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు ఎప్పటికప్పుడు సలహాలను సూచనలు అందిస్తూ కమిషనర్ పరిశీలించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి : జెడ్‌పిలో సభ్యులు ఆవేదన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సి ఉందని, దాని వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని జెడ్ పి టీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. విశాఖ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఇక్కడి జెడ్పీ చైర్ పర్సన్ జల్లేపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగింది. సమా వేశంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్ తదితరులు పాల్గొని సభ్యుల ప్రశ్నలకు అధికారులతో సమాధానాలిప్పించారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, రేగటి మత్స్యలింగం, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, విద్యుత్, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, ఇంజినీరింగ్ తదితర ముఖ్య శాఖలపై చర్చ జరగ్గా, వివిధ జిల్లాల అధికారులు సమీక్షించారు. అధికారులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గిరిజన ప్రాంతాల నుండి కేజిహెచ్ కి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర వైద్యాదికారులను కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశము బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, విద్య, వైద్య, ఆరోగ్య, త్రాగు నీటి సరఫరా, రహదారులు, పంచాయతి రాజ్ తదితర శాఖలలో జరుగుతున్న ప్రగతి పై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలక్టర్ విజయ్ కృష్ణన్, మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, అరకు శాసన సభ్యులు రేగటి మత్స్యలింగం, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, జడ్పీ సీఈవో నారాయణ మూర్తి,జెడ్ పిటిసిసి సభ్యులు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలో ప్రజలకు అత్యవసర వైద్యం కోసం కేజిహెచ్ కు వస్తారని, అలాంటి వారికి మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే ఏజన్సీ లో పనిచేసే వైద్యులకు, సిబ్బందికి మంచి సదుపాయాలు కలుగజేస్తే తప్పకుండా అక్కడి ఉండి పనిచేస్తారన్నారు. గిరిజన ప్రజలు కేజిహెచ్ లోని ఎస్.టి. సెల్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. సభ ప్రారంభమైన వెంటనే స్థాయి సంఘ సమావేశాలు, సర్వ సభ్య సమావేశాలు వేరు వేరుగా నిర్వహించాలని పలువురు సభ్యులు కోరగా వేరు వేరుగా నిర్వహిస్తామని చైర్ పర్సన్స్ తెలిపారు. శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ స్థాయీ సంఘ సమావేశాలలో ఆమోదము పొందిన అంశాలను సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అరకు, అనంతగిరి హైడ్రో ప్రాజెక్ట్ వలన ఏజన్సీ ప్రాంతం ముప్పుకు గురవుతుందని పర్యావరణానికి, రైతులకు నష్టం వాటిల్లితుందని ఈ హైడ్రో ప్రాజెక్ట్ సర్వే వెంటనే నిలిపివేయాలని జెడ్ పిటిసి డి. గంగరాజు తో పాటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కొంతమంది సభ్యులు కోరగా దీనికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సమాధానమిస్తూ అన్ని విషయములు పరిగణలోనికి తీసుకొని గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేసిన తర్వాత మాత్రమె ముందుకు వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయంపై సమీక్షలో ఉచిత విత్తనాలు అందించాలని విత్తనాలు ఎంపికపై రైతులు అవగాహన కల్పించాలని అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సురన్సు తదితర అంశములపై రైతులకు అవగాహన కల్పించాలని శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పలువురు సభ్యులు అధికారులను కోరారు. రైతులందరికీ సరిపడే విత్తనాలు ఉన్నాయని అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా వ్యవశాయ శాఖాధికారి వివరించారు. గత ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ సర్వే కొనసాగుతుందా, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి తెలపాలని సభ్యులు కోరగా దీనికి విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రీ సర్వే కొనసాగుతుందని తక్కువ గ్రామాలని తీసుకొని 250 ఎకరాలు ఒక బ్లాక్‌గా తీసుకొని రీసర్వే జరుగుతుందని అన్నారు. రీసర్వే సమస్యలు పరిష్కరించడానికి రెవిన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు. అసలు పట్టాదారులు ఎవరో భూమిని ఎవరు అనుభవిస్తున్నారో తెలిసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. గిరిజనులకు కెజిహెచ్ లో సరైన వైద్యం అందడం లేదని ప్రైవేటు వైద్య శాలలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని సభలో కొయ్యూరు జెడ్ పిటిసి సభలో ప్రస్తావించగా పూర్తి వివరాలు ఇస్తే విచారణ చేస్తామని ప్రభుత్వ వైద్య శాలలతో పాటు ప్రైవేటు నెట్ వర్క్ ఆసుపత్రులలో ఎన్ టిఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా వైద్యం పొందవచ్చునని కలక్టర్ చెప్పారు. కెజిహెచ్‌లో ఎస్ టి సెల్ కూడా బాగా పనిచేస్తున్నారని, ఎస్ టి సెల్ సేవలు కూడా ఏజెన్సీ ప్రజలువినియోగించు కోవాలని సూచించారు. కెజిహెచ్‌లో అందుతున్న సేవలు, ఓపి, ఇన్ పేషెంట్లు, ఆపరేషన్లు జరిగినవి సభ్యులకు తెలియజేయాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ నకు సూచించారు. డి.సి.హెచ్.ఎస్. (జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి) మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సి.హెచ్.సి.), ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పి.హెచ్.సి.) పూర్తిస్థాయి సిబ్బందితో పనిచేస్తున్నాయని, అన్నిరకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ముఖ్యంగా, హెచ్.ఐ.వి. మందులు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కె.జి.హెచ్. సూపరింటెండెంట్ మాట్లాడుతూ, కె.జి.హెచ్.లో అన్ని వైద్య సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇతర అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. జిల్లాలో అంబులెన్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తు తున్నాయని తెలియజేశారు. ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని వారు కోరారు. ఈ సమస్యపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ స్పందిస్తూ, ప్రభుత్వం వారితో మాట్లాడి సీ.ఎస్.ఆర్. నిధుల నుండి త్వరలో అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అంబులెన్స్‌ల కొరతను తీర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. జెడ్.పి.టి.సి. శ్రీమతి శెట్టి రోషిణి మాట్లాడుతూ, గిరిజన ప్రాంత వైద్యశాలల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉండేలా చూడాలని ఆమె కోరారు. అలాగే, ఈ వైద్యశాలల్లో పూర్తి స్థాయి నర్సులు సిబ్బందిని నియమించాలని కూడా ఆమె విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇది అత్యవసరమని ఆమె నొక్కి చెప్పారు. జెడ్.పి.టి.సి. అచ్చుతాపురం మాట్లాడుతూ, ఒకే ఇంటిలో వృద్దులు ఉండి, అదే ఇంట్లో హెచ్.ఐ.వి. రోగి కూడా ఉంటే, వారికి ఒక్క పింఛను మాత్రమే ఇస్తున్నారని తెలియజేశారు. దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యపై విశాఖపట్నం జిల్లా కలెక్టరు స్పందిస్తూ, హెచ్.ఐ.వి. రోగులకు మరియు వితంతు పింఛను లేదా వృద్ధాప్య పింఛను అర్హత ఉన్నవారికి విడివిడిగా పింఛన్లు ఇస్తారని స్పష్టం చేశారు. అటువంటి లబ్ధిదారులు ప్రాజెక్టు డైరెక్టరు, డి.ఆర్.డి.ఎ. వారినిగాని సంబంధిత మండల అధికారులనుగాని సంప్రదించాలని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జడ్.పి.టి.సి., అచ్చుతాపురం వారు మాట్లాడుతూ, అనకాపల్లి నుండి అచ్చుతాపురం రోడ్ల వెడల్పు పనులు సంవత్సరాల తరబడి జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ పనులపై వెంటనే కలెక్టరు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్వయంగా పర్యవేక్షించి త్వరలో పూర్తి చేయిస్తానని హామి ఇచ్చారు. ఈ సమస్యపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, తాను స్వయంగా పనులను పర్యవేక్షించి, త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. పనుల జాప్యాన్ని నివారించి, వాటిని వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. జడ్.పి.టి.సి. శ్రీమతి శెట్టి రోషణి ఎం.ఎల్.ఎ. మత్స్య లింగం మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ఉపాధ్యాయులు రాలేదని తెలియజేసారు. అల్లూరి సీతారాజు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు సాయంత్రం లోపు పూర్తి చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. కోఆప్టెడ్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో రికార్డులు లేవని చెప్పుతున్నారని తెలియజేసారు. విద్యా శాఖాధికారి వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల డేటా పూర్తి డిజిటలైజేషన్ జరిగినదని పూర్తి రికార్డులు వున్నవని తెలియజేసారు. సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణ మూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి, కె.రాజ్ కుమార్, జిల్లా పరిషత్ పరిపాలనాధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో రాష్ట్ర పబ్లిక్ అండర్‌టైకింగ్స్ శాసనసభా కమిటీ రాక

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర పబ్లిక్ అండర్‌టైకింగ్స్ శాసనసభా కమిటీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖపట్నం రానున్నదని విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆముదాలవలస శాసన సభ్యులు కూన రవికుమార్ అధ్యక్షతన 8 మంది శాసన సభ్యులు, ముగ్గురు శాసన మండలి సభ్యులతో కూడిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ 11వ తేది ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్ లో విశాఖపట్నం చేరుకొని సర్క్యూట్ హౌస్ కు వేళతారు. ఉదయం 10 గంటలకు కలక్టరేట్‌లో విఎంఆర్డిఎ, ఎ.పి.మెడ్ టెక్ జోన్, ఎపిఐఐసి, ఎపి టూరిజం, శ్రీకాకుళం స్మార్ట్ సిటి కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పోరేషన్‌ల వార్షిక నివేదికలు ,కార్యకలాపాలపై అధికారులతో సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2గంటలకు నగరంలో క్షేత్ర పర్యటన చేస్తారు. 12వ తేది ఉదయం కలక్టరేట్ లో ఎపిఇపిడిసిఎల్, ఎపిఎంటిజెడ్ మెడి వాలీ ఇన్క్యుబేషన్ కౌన్సిల్, ఎపి గిరిజన కార్పొరేషన్, బయో వ్యాలీ ఇన్క్యుబేషన్ కౌన్సిల్, వైజాగ్ అపారల్ పార్క్, ఎపిఐఐసి ఆర్టిసిల వార్షిక నివేదికల పై కార్యకలాపాలపై సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలో క్షేత్ర పర్యటన చేస్తారని కలక్టర్ తెలిపారు. రాత్రి 10 గంటలకు విశాఖపట్నం నుండి తిరిగి విజయవాడ వెళ్తారు. కూన రవికుమార్ అధ్యక్షతన వచ్చే ఈ కమిటీలో శాసన సభ్యులు ఎ.ఆనందరావు, ఎన్.ఈశ్వరరావు, జి.సత్య నారాయణ, జి.శిరీష, వి.కుమారరాజా, ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు, టి.శ్రావణ్‌కుమార్, వి.వెంకట కృష్ణ ప్రసాద్, శాసనమండలి సభ్యులు బి.రామ్ గోపాలరెడ్డి, కంట్రాక్టర్ ఇసాక్ భాషా, డా. కుంభా రవిబాబు ఉన్నారు.

ప్రముఖ FMCG బ్రాండ్‌లకు ప్రాప్యతను విస్తృతం చేయడానికి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు కెన్‌వ్యూ మీషో మాల్‌తో చేరాయి

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశం అంతటా వినియోగదారులకు రోజువారీ వెల్నెస్, పానీయాలు మరియు వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను విస్తృత ఎంపికలో అందించడానికి మీషో మాల్ టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు కెన్‌వ్యూ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా వినియోగదారులకు వ్యక్తిగత సంరక్షణ నుండి వెల్నెస్ మరియు పానీయాల వరకు విస్తృత శ్రేణి రోజువారీ నిత్యావసరాలను సులభంగా యాక్సెస్ చేయడానికి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు కెన్‌వ్యూ ఇండియా మీషో మాల్‌తో చేరాయి. ఈ భాగస్వామ్యం ద్వారా, టాటా టీ, టెట్లీ మరియు టాటా కాఫీ వంటి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ నుండి మరియు క్లీన్ & క్లియర్ ఫేస్ వాష్, జాన్సన్స్ బేబీ కేర్ ఉత్పత్తులు మరియు స్టేఫ్రీ సెక్యూర్ శానిటరీ ప్యాడ్‌లతో సహా కెన్‌వ్యూ ఇండియా నుండి ప్రసిద్ధ బ్రాండ్‌లు ఇప్పుడు మిలియన్ల మంది మీషో దుకాణదారులకు, ముఖ్యంగా టైర్ 2o మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి. డెహ్రాడూన్, పూరి, మధురై మరియు సూరత్ వంటి నగరాల నుండి వినియోగదారులు గ్రీన్ టీ, స్కిన్‌కేర్ మరియు పరిశుభ్రత ఉత్పత్తుల వంటి రోజువారీ వినియోగ వర్గాల కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మీషో మాల్ ఈ వర్గాలలో బలమైన నిశ్చితార్థాన్ని చూసింది, ప్రారంభించిన ఒక నెలలోనే టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు కెన్వ్యూ ఇండియా రెండింటి నుండి ఆఫర్లపై ఆసక్తి పెరుగుతోంది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు కెన్వ్యూ ఇండియా మీషోతో తమ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకుంటున్నందున, అవి డిజిటల్-ఫస్ట్ వినియోగదారుల యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న మరియు విభిన్నమైన స్థావరాన్ని చేరుకుంటున్నాయి. టైర్-2o మార్కెట్లలో మీషో యొక్క పెరుగుతున్న ఉనికిని పెంచుకోవడం ద్వారా, బ్రాండ్లు భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యంలో వాటి పరిధి మరియు ఔచిత్యాన్ని విస్తరిస్తున్నాయి.